సాక్షి కర్నూలు

ఆదివారం । 25 । ఆగస్టు । 2024




రమణీయం.. సమర్పణోత్సవం

శ్రీరాఘవేంద్రుల ఆరాధన సప్తరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం సర్వ సమర్పణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సమూర్తిని పంచవాహనాలపై ఊరేగించారు. 8లో▸



హాస్టళ్లపై 'ప్రత్యేక' పర్యవేక్షణ

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలపై జిల్లా కలెక్టర్ పీ రంజిత్‌బాషా ప్రత్యేక దృష్టి సారించారు. వీటిపై పర్యవేక్షణకు 81 మంది అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,628.12
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 87
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 32,723
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	: 9,830

న్యూస్‌రీల్

చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు చర్యలు

- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిరుద్యోగ యువతకు చిన్న తరహా పరిశ్రమలు స్థాపించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదోని, పత్తికొండ ప్రాంతాల్లో టమాటా, ఉల్లి స్టోరేజ్, ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలన్నారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద 53 క్లెయిమ్స్‌కు రూ. 4.11 కోట్ల విడుదలకు కమిటీ ఆమోదం తెలిపింది. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, పరిశ్రమల శాఖ జీఎం మారుతీ ప్రసాద్, ఏపీఐఐసీ జీఎం సోమశేఖరరెడ్డి, ఐలా చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కోఆర్డినేటర్ దిలీప్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ మునిప్రసాదు, ఎల్‌డీఎం రామచంద్రరావు, మత్స్యశాఖ జేడీ శ్యామల, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి పాల్గొన్నారు.

10 మంది ఉపాధి సిబ్బందిపై వేటు

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను భారీగా దుర్వినియోగం చేసిన ఉపాధి అధికారులు, సిబ్బందిపై వేటు పడింది. వెల్దుర్తి మండలంలో 2023–24లో జరిగిన ఉపాధి పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీలపై ఇటీవల ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఉపాధి పనుల్లో భారీగా అవినీతి జరిగినట్లు వెలుగు చూసింది. రూ.50 లక్షలకుపైగా ఉపాధి నిధులు దుర్వినియోగం జరిగినట్లు సామాజిక తనిఖీల్లో వెల్లడైంది. దుర్వినియోగమైన మొత్తం రికవరీ చేయాల్సి ఉండగా.. ఓపెన్ ఫోరంలో రూ.6 లక్షల రికవరీకి ఆదేశించారు. దుర్వినియోగానికి బాధ్యులైన ఏపీవో, ఈసీతో పాటు ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్లు(టీఏ), ఒక కంప్యూటర్ ఆపరేటర్(సీవో), నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్ల(ఎఫ్ఏ)ను సస్పెండ్ చేస్తూ జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

కుంటనహాల్ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని కుంటనహాల్ పంచాయతీ కార్యదర్శి జి.నగేష్‌ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సస్పెండ్ చేశారని జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సదరు పంచాయతీ కార్యదర్శి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంతో పాటు గ్రామ మహిళా సర్పంచుకు కనీస గౌరవం కూడా ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఆ మేరకు ఆదోని డివిజినల్ పంచాయతీ అధికారి చేత విచారణ జరిపించామన్నారు. వచ్చిన అభియోగాలు వాస్తవమని తేలడంతో కలెక్టర్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

నేడు 'లక్ పతి కా దీదీ'

- రూ.57 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం లక్ పతి కా దీదీ కార్యక్రమాన్ని ఆదివారం న్యూఢిల్లీ నుంచి ప్రారంభించనున్నారు. కర్నూలు కలెక్టరేట్‌లో లైవ్ టెలీకాస్ట్ ద్వారా ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎంపీ, ఎమ్మెల్యేలు, డీఆర్‌డీఏ పీడీ సలీమ్‌బాషా, స్వయం సహాయక సంఘాల మహిళలు, బుక్‌కీపర్లు తిలకించనున్నారు. ఈ సందర్భంగా బుక్ కీపర్లు, పొదుపు మహిళలతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడనున్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. జిల్లాలో సెప్టెంబరు చివరిలోగా 2,875, వచ్చే ఏడాది మార్చిలోపు 5,750 మంది మహిళలను లక్‌పతికా దీదీగా అభివృద్ధి చేయాలనేది లక్ష్యం. ఇందుకు రూ.80.50 కోట్లు రుణాల రూపంలో అందజేయనున్నారు. ప్రారంభోత్స కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ.57 కోట్ల రుణాలను పంపిణీ చేస్తూ మెగా చెక్ విడుదల చేయనున్నారు. స్వయం ఉపాధిలో రాణిస్తున్న మహిళలను, బుక్ కీపర్లను ప్రశంసాపత్రాలతో సత్కరించనున్నారు. ఇందుకు ప్రతి మండలం నుంచి ఐదుగురు బుక్‌కీపర్లు, ఐదుగురు పొదుపు మహిళలను ఎంపిక చేశారు.



ప్రత్యేక గదులు లేవు



పీజీ చేసే వైద్య విద్యార్థినులకు పెద్దాసుపత్రిలో తగినన్ని రెస్ట్‌రూమ్స్, వాష్‌రూమ్స్ లేవు. అత్యవసర ఓటీ, క్యాజువాలిటీ, ఐసీయూ, వార్డుల్లో వారి కోసం ప్రత్యేక గదులు ఉండాలి. పనిగంటలు ఎక్కువగా ఉన్నాయి. ఒక్కోసారి వారు నిరంతరంగా 36 గంటలు పనిచేయాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో నాలుగైదు గంటలన్నా విశ్రాంతి తీసుకుంటే పనిసామర్థ్యం పెరుగుతుంది. డ్యూటీ పూర్తి చేసుకుని ఇళ్లకు, హాస్టల్‌కు వెళ్లే సమయంలో వారిపై కుక్కలు, అపరిచితులు, ఆకతాయిలు దాడులు చేసే అవకాశం ఉంది.

–డాక్టర్ జి. జయరామ్, ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం కర్నూలు ఉపాధ్యక్షులు

ఎయిమ్స్ తరహా వసతులు అవసరం



ప్రభుత్వ ఆసుపత్రుల్లో పీజీ సీట్లు పెరుగుతున్నా అందుకు అనుగుణంగా వసతులు, సౌకర్యాలు పెరగడం లేదు. కేవలం డ్యూటీ డాక్టర్లకు మాత్రమే వాష్‌రూమ్స్, రెస్ట్‌రూమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కువసేపు పనిచేసేది పీజీలే. వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎయిమ్స్ లాంటి ఆసుపత్రుల్లో అన్ని విభాగాల్లో రెస్ట్‌రూమ్స్, వాష్‌రూమ్స్ ప్రత్యేకంగా ఉంటాయి. రీఫ్రెష్ కావడానికి అక్కడే టీ చేసుకునే అవకాశం ఉంటుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఇలాంటి వసతులు కల్పించాలి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పీజీలకు నాలుగు రూములు ఇస్తామన్నారు. ఆ రూముల్లో బెడ్స్‌ను ఐఎంఏ అందించేందుకు సిద్ధంగా ఉంది.

–డాక్టర్ కె. రామచంద్రనాయుడు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు, కర్నూలు

మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలి



ప్రభుత్వ వైద్యశాలల్లో విధులు నిర్వహించే మహిళా వైద్యులతో పాటు సిబ్బందికి రక్షణ కల్పించాలి. వైద్యవృత్తిని నమ్ముకొని రాత్రి, పగలు కష్టపడి పనిచేస్తున్నా కొంత మంది ఆకతాయిలతో భయాందోళనలకు గురవుతున్నాం. రాత్రి సమయాల్లో ఆసుపత్రి ప్రాంతంలో పోలీసులతో ప్రత్యేక నిఘా ఉంచాలి. వైద్యులు ధైర్యంగా రోగులకు చికిత్స అందించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ రాగిణి, వైద్యాధికారి, మద్దికెర పీహెచ్‌సీ



నల్లమల తేనెలూరు

సకల జీవుల అన్నదాత తేనెటీగ. అది లేని నాడు సజీవ ప్రపంచమే లేదు. ఆఖరు తేనెటీగ చనిపోయాక ఈ భూమిపై ఇంకేమి మిగలదు అని పర్యావరణ విశ్లేషకుల మాట. అంటే సకల మానవాళికి, జంతుజాలానికి ఆహారన్నందించే ఫలసాయం నిలిచి పోతుందని అర్థం. జీవవైవిధ్యం, పర్యావరణ రక్షణకు ఈ జీవి జీవితాంతం శ్రమిస్తుందనడంతో సందేహం లేదు. ఈ క్రమంలో తేనెటీగలు ఉత్పత్తి చేసే తేనె మానవాళికి బహుళ ఉపయుక్తి దాయకంగా మారింది. నల్లమలలో చెంచు గిరిజనులు గతంలో తమ జీవనం కొనసాగించడానికి తేనె సేకరణే ప్రధాన వనరుగా ఉండేది. నల్లమలలోని తేనెటీగల విశేషాలపై ప్రత్యేక కథనం.

– ఆత్మకూరు రూరల్

- అభయారణ్యంలో ఐదు రకాల తేనెతెట్టలు
- పర్యావరణ రక్షణలో చిరు కీటకం కీలకం
- గతంలో ఏటా 6 టన్నులపైగా సేకరణ
- నాడు చెంచులకు జీవనాధారం
- ఇతర ఉపాధి అవకాశాలతో నేడు సేకరణకు దూరం

చీమల తరహాలోనే తేనెటీగలు సామూహిక శ్రమశక్తికి చిహ్నాలు. తేనెతెట్టను తయారు చేసుకున్న తరువాత తన సంతానోత్పత్తి ప్రారంభించే తేనెటీగలు షడ్భుజాకారంలోని తేనె పట్టు గూళ్లలో తమ పిల్లలను ఉంచుతాయి. ఈ పిల్లల పోషణ కోసం పువ్వుల నుంచి మకరందాన్ని సేకరించి తేనెగా మారుస్తాయి. ఒక తేనెటీగ రోజుకు కనీసం పుష్పాల లభ్యతను బట్టి 20 సార్లు మకరందాన్ని తెట్టెకు చేరుస్తాయి. ఒక్కో ట్రిప్‌లో కనీసం 50 పుష్పాలపై తేనెటీగలు వాలి తన పొడవాటి తొండంతో మకరందాన్ని సేకరిస్తాయి. పనిలో పనిగా తన కాళ్లకింద వుండే మెత్తటి స్పాంజ్ లాంటి మెత్తలకు ఆయా పూల పుప్పొడిని అంటించుకుని మరొక పువ్వుపై వాలి పరాగ సంపర్కానికి కారణమవుతాయి. నల్లమల అటవీ ప్రాంతంలో ఐదురకాల తేనె తెట్టలు కనిపిస్తాయి. తెట్టెల, ఈగల పరిమాణాన్ని బట్టి పెద్దపార, తొడిది, జున్ను (జుంటి, చిన్నపార) ముసర, కన్నుగులగా వీటిని గిరిజనులు తమ వ్యవహారికంలో పిలుస్తుంటారు.

పెద్దపార..

తేనెపారలలో పెద్ద పార అన్నింటికంటే భారీగా ఉంటుంది. పెద్ద వృక్షాలు, కొండ చివర్లు, గుహ అంచుల్లో ఈ పారను చూడవచ్చు. పారను పెట్టే ఈగలు పెద్దగా ఉండడమే కాకుండా అత్యంత విషపూరితమైనవి. వీటి దాడి ప్రాణాంతకంగా కూడా ఉంటుంది. ఒక పార నుంచి కనీసం 10 కేజీలు పొందవచ్చు.

జున్ను..

పొదల్లో చిన్నపాటి చెట్ల కొమ్మల్లో కనిపించేదే జున్ను, చిన్నపార. పరిమాణంలో చిన్నగా, కోణాకారంలో ఈ తేనెపట్టు కనిపిస్తుంది. ఈ తేనెను రుచిని బట్టి జున్ను, జుంటి అని కూడా పిలుస్తుంటారు. ఇవి కుట్టినా విష ప్రభావం తక్కువగానే ఉంటుంది.

తొడిది..

చెట్లు తొర్రలు, రాతి పగుళ్లలో లభ్యమయ్యే తొడిది తేనె పట్టు నిర్మాణం వైవిధ్యంగా ఉంటుంది. దొంతరులుగా తేనె పట్టులను తొర్ర పరిమాణాన్ని బట్టి తేనెటీగలు పెంచుకుంటూ పోతుంటాయి. ఈ పట్టు ద్వారా 2 కేజీల వరకు తేనె లభ్యమవుతుంది.

ముసర..

పరిమాణంలో చాలా చిన్నవి. చిన్నపాటి తెట్టెలను పెడతాయి. ముసర పట్టుల నుంచి తేనె పెద్ద పరిమాణంలో లభించక పోయినా రుచి కోసం ఈ తేనెను సేకరిస్తుంటారు. గోడల పగుళ్లలో, వృక్షాల బెరడుల కింద ఇవి కనిపిస్తుంటాయి.

కన్నుగుల..

పిల్లలకు మాటలు రావడం ఆలస్యమవుతుందనే సమయంలో వారి నాలుకపై తేనె రాయడం అందరికీ తెలిసిన విషయమే. అయితే ఇందుకోసం ప్రత్యేక మైన తేనె ఉంటుందని చాలా మందికి తెలియదు. ఈ తేనె కన్నుగుల తేనెపట్టు నుంచి లభ్యమవుతుంది. చెట్టు కొమ్మలపై, మొక్కల మొదళ్లలో, పొదల్లో చిన్న బుడిపెల మాదిరి కన్నుగుల తేనె పట్టులు నల్లమలలో కనిపిస్తాయి.





పసుపు వర్ణం అంటే మక్కువ..

తేనెటీగలు పసుపు వర్ణపు పూలపై ఎక్కువ మక్కువ చూపుతాయి. మకరందం సేకరణకు ఎక్కువగా ఆవర్ణపు పూలైన వేరుశనగ, పొద్దుతిరుగుడు, ఆవాలు వంటి రైతులు సాగు చేసే పంట పుష్పాలపై వాలుతూ ఉంటాయి. అలాగే అడవి పూలు అయిన పచ్చారి, నీలగపూలు, తులివి పూలు, దేవదారు, టేకు, పాలికి వంటి వాటిని ఆశ్రయిస్తాయి.

అడవి దాటని తేనె..

గిరిజనులు కష్టపడి సేకరించే తేనెను గతంలో గిరిజన కో–ఆపరేటివ్ స్టోర్లలో విక్రయించేవారు. దాదాపు రెండు దశాబ్దాలుగా స్టోర్స్‌కు చేరే తేనె తగ్గుతూ వచ్చి ప్రస్తుతం సున్నా స్థాయికి పడిపోయింది. దీనికి గల కారణాలను విశ్లేషిస్తే పలు ఆసక్తికరమైన విషయాలు తెలుస్తాయి. నిజానికి 2000 సంవత్సరం నాటికి శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో 6 వేల కేజీల తేనె సమీకరించబడేది. కొండ చరియల అంచుల్లో ఎత్తైన చెట్ల కొమ్మ చివర్లలో నుంచి తేనె సేకరించడం అత్యంత ప్రమాదకర విన్యాసం. 2004 తరువాత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రావడం అది గిరిజన ప్రాంతాల్లో అమలు చేయడంతో ప్రమాదకరమైన తేనె సేకరణ నుంచి గిరిజనులు ఉపాధి మార్గాన్ని మార్చుకున్నారు. దీంతో తేనె సేకరణ తగ్గుతూ వచ్చింది. అంతే కాకుండా గిరిజన కో – ఆపరేటివ్ స్టోర్స్ లో తేనె నాణ్యతపై 18 రకాల ప్రమాణాలను అవలంభించడంతో ఆదిమ చెంచు గిరిజనులు సేకరించే తేనె ఆ ప్రమాణాలను అందుకోలేక పోయింది. అంతే కాకుండా స్టోర్ల గిరిజనుల నుంచి సేకరించే తేనె కేజీకి రూ. 450 మాత్రమే ఇస్తుండడంతో అక్కడక్కడా సేకరించే తేనెను బయట రూ.800 వరకు విక్రయించుకుంటున్నారు. అంతే కాక వ్యవసాయ రంగంలో క్రిమిసంహారక మందుల వినియోగం పెరిగి పోవడం కూడా నల్లమలలో తేనె ఉత్పత్తి తగ్గి పోవడానికి ఒక కారణంగా చెబుతున్నారు. నల్లమలలో ఇపుడు సరదాకు తేనె సేకరించే వారు తప్ప దాన్ని ఉపాధిగా భావించే వారు కనుమరుగయ్యారు.

మరిన్ని విశేషాలు..

- ఎలుగు బంటికి తేనె అంటే ఎంతో ఇష్టం. సహజంగా వాటి ఒంటి నిండా దట్టంగా వెంట్రుకలుండడంతో తేనెటీగల దాడి నుంచి తప్పించుకోగలుతాయి. ముట్టిపై మాత్రమే ఈగల దాడికి అవకాశముంటుంది. తేనె తెట్టె కనిపిస్తే వదిలేయవు. ఎంత ఎత్తులో ఉన్నా సరే తినేందుకు ప్రయత్నిస్తాయి.
- తేనెటీగ కుడితే ఆ బాధ వర్ణనాతీతం. చెంచులకు ఇందుకు అద్భుతమైన విరుగుడు కూడా తెలుసు. తేనెపార తెట్టెలో ఉండే పిల్లల తెట్టె (పిల్లలున్న గూడు)ను పిండి ఆపాలు తాగడం ద్వారా నొప్పిని నివారించుకుంటారు.
- చెంచులు తేనె సేకరణకు పచ్చటి ఆకులున్న కొమ్మలను కట్టగట్టి అందులో నిప్పు వేసి పొగను సృష్టిస్తారు. దీన్ని సుడి అని కూడా అంటారు. ఈ సుడి కట్టను తీసుకుని చెట్టు ఎక్కి వారు తేనె పట్టును చేరుకుని పట్టుపైకి పొగను మలుపుతారు.
- తేనెను తగుపాళ్లలో వినియోగించుకోవడం ద్వారా కాన్సర్, గుండె జబ్బులను నివారించవచ్చు. అల్సర్ల వంటి గాస్ట్రో ఇంటర్ స్టయిన్స్ జబ్బులను నివారిస్తుంది. తేనె బాక్టీరియా, ఫంగల్ సంబంధిత వ్యాధులను అరికడుతుంది.

అడవి తేనె సేకరణ తగ్గిపోయింది

గిరిజనులు తేనే సేకరణకు దూరం కావడంతో జీసీసీ స్టోర్లకు కనీస స్థాయిలో కూడా తేనె రావడం లేదు. పర్వత ప్రాంతాల్లో తేనె పట్టు పెట్టుకునే రాక్ హనీ బీలు రైతులు ఉపయోగిస్తున్న క్రిమిసంహారకాల వల్ల చనిపోతూ సంతతని కోల్పోతున్నాయి. అలాగే క్రమంలో చెంచులు తమ పిల్లలను చదివిస్తుండటం, ఇతర పనులకు పంపుతుండటంతో ఫల సేకరణకు దూరమవుతుండటంతో అడవి తేనె బయటకు రావడం లేదు.

– పుల్లారావు, మేనేజర్, జీసీసీ, ఐటీడీఏ, శ్రీశైలం

తేనె సేకరణ ఒక సాహసం



తేనె సేకరణ అన్నది మా చెంచులలో ఉన్న పురాతన వృత్తి. అత్యంత సాహసంతో తేనె సేకరణ చేయాల్సి ఉంటుంది. చిటారు కొమ్మలు, కొండ అంచులో ఉన్నా కూడా భయపడరు. ఎంత ఎత్తులో ఉన్నా సరే సులువుగా తేనె తెట్టను కిందకు దించుతారు.

– అంకన్న, పెచ్చెర్వు చెంచుగూడెం

అడవికి దూరమయ్యాం



గతంలో మేము బతికేందుకు ఈ అడవే ఆధారం. తేనె, కంద గడ్డలు, అరుదైన పండ్లు సేకరించి విక్రయించే వాళ్లం. వాటి కోసం అడవిలో చాలా దూరం పోవాల్సి వచ్చేది. ఇప్పుడు వ్యవసాయం, ఇతర పనులకు వెళ్తున్నాం. తేనె సేకరణ మా పిల్లలకు ఇప్పుడు కష్టం.

– ఈదమ్మ, రుద్రకోడు చెంచుగూడెం

ఐజీ వైపు అందరి చూపు!

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో బదిలీల జాతర

- ఉద్యోగుల వివరాలన్నీ ఆయనకే నివేదన
- మార్గదర్శకాల కోసం ఉద్యోగుల నిరీక్షణ
- సబ్ రిజిస్ట్రార్ నుంచి అటెండర్ల వరకున్న ఉద్యోగులందరితో దరఖాస్తులు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రవ్యాప్తంగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీల ప్రక్రియ గతానికన్నా భిన్నంగా జరుగుతోంది. అటెండర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ వరకు అందరి వివరాలను ఐజీకి పంపి మార్గదర్శకాల కోసం డీఐజీలు, జిల్లా రిజిస్ట్రార్లు ఎదురుచూస్తున్నారు. ఈసారి బదిలీలన్నీ ఐజీనే చేస్తారేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి.. గతంలో డీఐజీ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్లే బదిలీ చేసేవారు. ఇందులో సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లను డీఐజీలు.. జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు, స్వీపర్లను జిల్లా రిజిస్ట్రార్ బదిలీ చేసేవారు. కేవలం శాఖాపరంగా సర్వీసు, ఇతర వివరాలను దృష్టిలో ఉంచుకుని ఐజీ మార్గదర్శకాలను విడుదల చేసేవారు. ఆ ప్రకారం ఐజీ పర్యవేక్షణ మాత్రమే చేసేవారు. అయితే, ఇప్పుడు పరిస్థితి అంతా మారిపోయినట్లు తెలుస్తోంది. అటెండర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ వరకున్న ఉద్యోగులందరి సర్వీసులు, సస్పెన్షన్లు, ఇతర వివరాలన్నింటినీ ఐజీ తెప్పించుకోవడం.. పైగా సమయం మించి పోతున్నా మార్గదర్శకాలను విడుదల చేయకపోవడంతో బదిలీలన్నీ ఆయనే చేస్తారేమోనని కలకలం రేగుతోంది. ఇక అనువైన ప్రదేశం కోసం కొందరు సబ్ రిజిస్ట్రార్లు ఉన్నతాధికారులకు ముడుపులు చెల్లించి కీలక పోస్టింగ్‌లు తెచ్చుకోవడం పరిపాటి. అదే సమయంలో ప్రభుత్వ పెద్దలు కూడా తమకు కావల్సిన ప్రదేశాల్లో అనుకూలంగా ఉండే వారిని ఎంపిక చేసుకుని నియమించుకోవడం కూడా సర్వసాధారణమే.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

- జేసీ నవ్య

సి.బెళగల్: ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని అధికారులను జాయింట్ కలెక్టర్ నవ్య ఆదేశించారు. మండలంలోని కొత్తకోట, కె.సింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల, పల్‌దొడ్డి గ్రామాల్లోని రీచ్‌ల నుంచి ఇసుక పంపిణీ ఈ నెల నుంచి ప్రారంభం కానుందని అధికారులు తెలిపారు. ఇందుకోసం సి.బెళగల్ – 2 గ్రామ సచివాలయంలో బుకింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. జిల్లా మైనింగ్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్‌తో కలిసితో జేసీ పరిశీలించారు. అనంతరం ఈర్లదిన్నె గ్రామం దగ్గరున్న ఇసుక రీచ్‌ను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు తెలియజేశారు. ఆర్డీఓ శేషిరెడ్డి, తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్, ఎస్‌ఐ తిమ్మారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ పాల్గొన్నారు.



ఈర్లదిన్నె ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జేసీ నవ్య

చీకటి దారుల్లో వెలుగు పూలు

- అంధత్వాన్ని జయించిన ఉపాధ్యాయుడు
- బ్రెయిలీ లిపిలో పాఠ్యాంశాల బోధన
- అంధుల కోసం ప్రత్యేక భగవద్గీత రూపకల్పన
- కృష్ణాష్టమి సందర్భంగా ఆవిష్కరణ

చూపులేదని చిన్నబోలేదు..
చీకటిని తిట్టుకుంటూ కూర్చోలేదు..
విధిరాత అని సరిపెట్టుకోలేదు..
ఆయన పట్టుదలతో శ్రమించారు..
పది మందికి పాఠాలు చెప్పే స్థాయికి ఎదిగారు..
బ్రెయిలీ లిపిలో ఆలయాన్నే నిర్మించారు..
అంధుల కోసం ప్రత్యేక భగవద్గీత గ్రంథాన్ని తీసుకొచ్చారు..
ఎందరికో ఆదర్శంగా నిలిచి..
జీవితంతో వెలుగు పూలు పూయించిన బూర్ల లక్ష్మన్న విజయగాథ ఇదీ..



బ్రెయిలీ లిపిలో లక్ష్మన్న నిర్మించిన భగవద్గీత ఆలయం



ఆలయంలో రాధాకృష్ణుల విగ్రహాలు

ఆలూరు: అవకాశాలు ఉన్నా చాలా మంది అందిపుచ్చుకోలేకపోతున్నారు. ప్రతిభను వెలికి తీసే మార్గాలు ఉన్నా.. వాటిని వినియోగించుకోలేక పోతున్నారు. ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూస్తూ.. కాలక్షేపం చేస్తూ తమ ఉన్నతిని తామే తుంచుకుంటున్నారు.. నిరుత్సాహంతో కుంగిపోతున్నారు. అయితే ఇందుకు భిన్నంగా బూర్ల లక్ష్మన్న అవకాశాలు అందిపుచ్చుకున్నారు.. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి వైకల్యం శరీరానికే గాని మనస్సు కాదని నిరూపించారు. ఆలూరు గ్రామానికి చెందిన హరిజన బూర్ల హనుమప్ప, బూర్ల నరసమ్మ దంపతులకు ముగ్గురు సంతానం కాగా.. వారిలో పెద్దకుమారుడు బూర్ల లక్ష్మన్న. పుట్టకతోనే కంటి చూపును కోల్పోయారు. కుమారుడి భవిష్యత్‌పై తల్లిదండ్రులు బెంగతో ఉండగా.. లక్ష్మన్న ధైర్యంగా తోటి పిల్లల సాయంతో ఆదిఆంధ్ర పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశారు. కుమారుడి ఉత్సాహాన్ని గమనించి తల్లిదండ్రులు ప్రోత్సహించారు. ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ వరప్రసాద్ సహకారంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పట్టా పొందారు. బ్రెయిలీ లిపిలో డీఎడ్ కోర్సు పూర్తి చేసి 1993లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. ప్రస్తుతం ఆలూరుకు ఐదు కిలోమీటర్ల దూరంలోని హుళేబీడు పాఠశాలలో పనిచేస్తున్నారు. అవహేళలను దాటుకుని ఎన్నో విజయాలు సాధించిన బూర్ల లక్ష్మన్నకు జానపద సంగీతంలో మంచి పట్టు ఉంది. బుర్ర కథలను బాగా చెప్పగలరు. భజన పోటీల్లో న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారు.



బ్రెయిలీ లిపిలోని భగవద్గీతను చూపుతున్న లక్ష్మన్న

సమాజానికి ఏదైనా ఇవ్వాలని...

ఇతరుల నుంచి ఏమి తీసుకోవాలో అని ఆలోచించకుండా.. తాను సమాజానికి ఏదైనా ఇవ్వాలని ఈయన సంకల్పించారు. ఈ కోవలోనే ఆలూరు పట్టణం ఎల్లార్తి రోడ్డు సమీపంలో ఐదు సెంట్ల స్థలంలో దాతల సహకారంతో బ్రెయిలీ లిపిలో రాధాకృష్ణుల దేవాలయాన్ని నిర్మించారు. అంతేకాకుండా భగవద్గీత సారాంశాన్ని బ్రెయిలీ లిపిలో అనువదించి బెంగళూరుకు చెందిన మిత్ర జ్యోతి ట్రస్టు ద్వారా ముద్రింప జేశారు. కృష్ణాష్టమి సందర్భంగా ఈ గ్రంథాన్ని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కె. హేమ చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు లక్ష్మన్న తెలిపారు.

ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలి


కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన.. మా కర్మఫల హేతుర్భూః మాతే సంగోస్త్వకర్మణి.. అని భగవద్గీతలో ఒక శ్లోకం ఉంది. భగవద్గీత సారాంశాన్ని తెలుసుకుని అందరూ సత్ప్రవర్తతో మెలగాలి. ఇతరులకు తోచిన విధంగా సహాయ సహకారాన్ని అందించాలి. అప్పుడే జన్మధన్యమవుతుంది. ఊపిరి ఉన్నంత వరకు నేను ఇతరులకు సహాయం చేసేందుకు తోడ్పాటు అందిస్తాను.

– బూర్ల లక్ష్మన్న, ఆలూరు


నల్లమల అడవిలో అల్లుకున్న తీగలు..


కనువిందు చేస్తున్న జలపాతం


అడవిలో జలకళ


సెలయేటి సోయగం


చెట్టు కింద జలధార


ఇందిరేశ్వరం వద్ద అలుగెక్కి పారుతున్న చెరువు


నల్లమల అడవిలో నుంచి ఇందిరేశ్వరం చెరువు దిశగా వస్తున్న నీరు

జల స్వర్గం

రాజసాన్ని చూపుతూ.. హుందాతనాన్ని ప్రదర్శిస్తూ భారీ వృక్షాలు.. అటూ ఇటూ తిరుగుతూ.. వయ్యారాలు ఒలకబోస్తూ అల్లుకున్న లతలు... లోతైన లోయలు.. ఎత్తయిన కొండలు.. వర్ష రుతువులో నల్లమల సరికొత్త అందాలను అద్దుకుంది. బండరాళ్లపై చిందులేస్తూ గలగల పారే సెలయేర్లు.. శ్రావ్యమైన సంగీతాన్ని వినిపిస్తూ దూకే జలపాతాలు.. వాన చినుకులతో నాట్యమాడే చిగురుటాకులు.. అడుగడుగునా కనువిందు చేసే నీటి ధారలు.. ఎన్నెన్నో దృశ్యాలు.. అడవి నిండా అద్భుత సోయగాలు.. ఇది 'జల' స్వర్గమా అనేంత భ్రమ కలిపిస్తూ మంత్రముగ్ధులను చేస్తున్నాయి. అయితే వీటిని తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు అవకాశం లేదు. పులుల ఏకాంత సమయం కావడంతో అటవీశాఖ అధికారులు అనుమతి నిరాకరిస్తున్నారు. ఆత్మకూరు మండలం ఇందిరేశ్వరం అందాలు 'సాక్షి' పాఠకులకు ప్రత్యేకం.

– ఫొటోలు: డి. హుస్సేన్, సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


చెరువు కింద పొలంలో నాట్లు వేస్తున్న కూలీలు

క్లుప్తంగా

ఏపీ మోడల్ స్కూల్స్ ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీకి అభినందనలు తెలుపుతున్న రాష్ట్ర కమిటీ నాయకులు

కర్నూలు సిటీ: ఏపీ మోడల్ స్కూల్స్ ఎస్టీయూ జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ప్రభుత్వ ఉన్నత(టౌన్ మోడల్ స్కూల్)పాఠశాలలో ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మునిరత్నం, రాష్ట జనరల్ సెక్రటరీ మార్కండేయులు పాల్గొని ప్రసంగించారు. ఏపీ మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఉద్యోగులకు 010 పద్దు జీతాలు పొందేందుకు కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షులు మోహన్ రెడ్డిని వారు అభినందించారు. మును ముందు ఉద్యోగులకు హెల్త్‌కార్డులు, కారుణ్య నియామకాల సాధన కోసం సంఘం పని చేస్తుందన్నారు. ఆ తరువాత జిల్లా కమిటీ నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ రెడ్డి ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎ.నాగ యల్లప్ప (ఏపీ మోడల్ స్కూల్, జూలకల్లు, గూడూరు), జనరల్ సెక్రటరీగా విశ్వేశ్వరయ్య (కృష్ణగిరి ఏపీ మోడల్ స్కూల్), కోశాధికారి కె.పరమేశ్వరరెడ్డి (పెద్దకడబూరు, ఏపీ మోడల్ స్కూల్) ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్స్ జాస్మిన్, షాహన పర్వీన్, దిల్షాద్ పాల్గొన్నారు.

నేడు గణేష్ మహోత్సవ కేంద్ర సమితి సమావేశం

కర్నూలు కల్చరల్: శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి సమావేశం ఆదివారం సాయంత్రం 5 గంటలకు వినాయక్ ఘాట్‌లో నిర్వహిస్తున్నట్లు సమితి నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు పేర్కొన్నారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి నిర్వహించనున్న వినాయక ఉత్సవాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. నగరంలోని వినాయక మండపాల నిర్వాహకులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేక రక్షణ తప్పనిసరి



వైద్య,ఆరోగ్య శాఖలో పని చేస్తున్న మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. వీరు గ్రామాల్లో తిరిగి ప్రజల ఆరోగ్య సమాచారాన్ని సేకరించాలి. విధి నిర్వహణలో ఉన్న మహిళకు తోడుగా మరో మహిళ ఉంటే ఏ విధమైన సమస్య ఉండదు. పలు సందర్భాల్లో ఒంటరిగా కూడా వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇటువంటి సమయంలో మహిళలు అభద్రతాభావంతో పని చేయాలి. ఈ పరిస్థితి లేకుండా ప్రభుత్వాలు ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలి.

– విజయకుమారి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ప్యాపిలి



సెక్యూరిటీని పెంచాలి



ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందికి ప్రభుత్వం రక్షణ కల్పించాలి. కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన సంఘటన యావద్దేశాన్ని కుదిపేసింది. ఆసుపత్రుల్లో సెక్యూరిటీని పెంచటమే కాకుండా రోగులను చూసేందుకు వచ్చేవారిని అనుమతించే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పేషంట్ విజిటింగ్ అవర్స్‌ను కుదించి తగిన సమయాన్ని కేటాయించాలి.

– ఇందిర, స్టాఫ్‌నర్స్, సీహెచ్‌సీ, కోవెలకుంట్ల

భద్రత కల్పించాలి



రాత్రివేళల్లో ఆస్పత్రుల్లో మహిళా డాక్టర్లకు భద్రత కల్పించి ధైర్యాన్ని నింపాలి. రాత్రి వేళలో వారికి డ్యూటీలు వేయకుండా చూడాలి. ఒకవేళ డ్యూటీ వేసినా సెక్యూరిటీని, సీసీ కెమెరాల నిఘాను పెంచాలి. మహిళా డాక్టర్లపై దాడు చేసిన వారికి కఠినమైన శిక్ష విధించేలా ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకురావాలి.

– డాక్టర్ కవిత, ఆత్మకూరు సీహెచ్‌సీ

హాస్టళ్లపై 'ప్రత్యేక' పర్యవేక్షణ


మీదివేముల హాస్టల్ పరిసరాల్లోని టాయ్‌లెట్లను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

జిల్లాలో హాస్టళ్ల వివరాలు ... (ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్)

సంక్షేమం	బాలురు	బాలికలు	మొత్తం
సాంఘిక సంక్షేమం	22	15	37
బీసీ సంక్షేమం	28	16	44
గిరిజన సంక్షేమం	04	03	07
మైనారిటీ సంక్షేమం	02	02	04

- 81 మంది అధికారులకు ప్రత్యేక బాధ్యతలు
- ప్రతి హాస్టల్‌ను పరిశీలించి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలపై జిల్లా కలెక్టర్ పీ రంజిత్‌బాషా ప్రత్యేక దృష్టి సారించారు. వాటిని మంచి వాతావరణంలో ఉంచేందుకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 81 మంది అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. వీరు తప్పనిసరిగా తమకు కేటాయించిన వసతి గృహాలను తనిఖీ చేసి అక్కడ నెలకొన్న సమస్య లను నివేదిక రూపంలో జిల్లా కలెక్టర్‌కు అందించాల్సి ఉంది. మండల తహసీల్దార్, ఎంపీడీఓ, ఆర్‌డీఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌తో పాటు పలు ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు కూడా ప్రత్యేకాధికారుల జాబితాలో ఉన్నారు. వీరంతా తమ అధికారిక కార్యక్రమాల్లో భాగంగా ఆయా ప్రాంతాలకు వెళ్లిన సమయంలో కచ్చింతగా తమకు కేటాయించిన వసతి గృహాలను తనిఖీలు చేస్తున్నారు. దీంతో ఏ అధికారి ఎప్పుడు హాస్టల్‌కు వచ్చి విజిట్ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొనడంతో వసతి గృహ సంక్షేమాధికారులు హాస్టల్‌ను వదలిపెట్టి వెళ్లేందుకు జంకుతున్నారు. ఇటీవల అనకాపల్లిలోని ఓ ఆశ్రమంలో ఫుడ్ పాయిజన్‌తో ముగ్గురు చిన్నారులు మృత్యువాత పడగా, దాదాపు 35 మంది చిన్నారులు ఆసుపత్రుల పాలయ్యారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో ఎక్కడా చోటు చేసుకోకుండా ఉండేందుకు కలెక్టర్ చర్యలు తీసుకున్నారు.

సౌకర్యాలపై ఆరా ...

సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులు (టాయ్‌లెట్స్, స్నానపు గదులు, రన్నింగ్ వాటర్, ఎలక్ట్రిసిటీ) ఉన్నాయా, లేదా ? లేని పక్షంలో ఏ రకమైన వసతులు కల్పించాలనే విషయాలను విచారించి నివేదికలను కలెక్టర్‌కు అందించేందుకు సంబంధిత ప్రత్యేకాధికారులు చర్యలు చేపడుతున్నారు.

మారుమూల హాస్టళ్లపై నిఘా అధికం

సంక్షేమ వసతి గృహాలకు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు తీసుకున్న అధికారులు మారుమూల ప్రాంతాలు, కర్ణాటక సరిహద్దులో ఉన్న వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఆదోని డివిజన్‌లోనే మెజారిటీ వసతి గృహాలు ఆ కోవలో ఉన్నాయి. జిల్లా కలెక్టర్ సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో చుట్టపు చూపుగా హాస్టళ్లకు వెళ్లే వసతి గృహ సంక్షేమాధికారులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఏ అవాంతరం ఏ రూపంలో వచ్చి మీద పడుతుందో అనే ఆందోళనకు గురవుతున్నారు.

పీసీ అండ్ పీఎన్‌డీటీ సమావేశం వాయిదా

కర్నూలు(సెంట్రల్): జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధ్యక్షతన శనివారం జరగాల్సిన పీసీ అండ్ పీఎన్‌డీటీ(లింగానిర్ధారణ) సమావేశం కొన్ని అనివార్య కారణాలతో వాయిదా పడింది. మొదట సమావేశం నిర్వహించాలని కలెక్టర్‌తో పాటు సభ్యులైన ఏడో అదనపు జిల్లా జడ్జి భూపాల్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ వచ్చారు. అనుకోకుండా సమావేశం అజెండాను చర్చించకుండానే వాయిదా వేసి మరోసారి జరిగేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు.

విద్యుత్ శాఖలో బదిలీలకు రంగం సిద్ధం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ శాఖలో బదిలీ లకు రంగం సిద్ధమైంది. ఐదేళ్లు పూర్తి చేసు కున్న వారిలో 8 మంది ఏఈలు, ఒక సివిల్ ఇంజినీర్, ఐదుగురు జేఈలు, ఆరుగురు జేఏవోలు, 9 మంది సీనియర్ అసిస్టెంట్లు, 13 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు టైపిస్టులు, 12 మంది రికార్డు అసిస్టెంట్లు, ఇద్దరు గ్రేడ్–1 ఫోర్‌మెన్‌లు, 43 మంది ఆఫీసు సబార్డినేట్లు ఉన్నారు. వీరే కాక మరికొంత మంది రిక్వెస్ట్ మీద బదిలీలు కోరే అవకాశం ఉంది.

రమణీయం.. సర్వ సమర్పణోత్సవం

- వివిధ వాహనాలపై ఊరేగిన ప్రహ్లాదరాయలు


భక్తులను ఆశీర్వదిస్తున్న శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: వేదమూర్తి శ్రీరాఘవేంద్రుల ఆరాధన సప్తరాత్రోత్సవాలు అట్టహాసంగా ముగిశాయి. వేడుకల్లో భాగంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో శనివారం రాత్రి ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు సర్వ సమర్పణోత్సవం గావించారు. ఉత్సమూర్తిని పంచవాహనాలపై ఊరేగించారు. గజ, అశ్వ, సింహ, మయూర వాహనాలపై కొలువుంచి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు వాహనోత్సవానికి శ్రీకారం పలికారు. అశేష భక్తజన వాహిని మధ్య రాయరు రమణీయంగా ఊరేగారు. అనంతరం ఊంజల మంటపంలో రాయరుకు ఉయ్యాల, దివిటీ సేవ నిర్వహించారు. యోగీంద్ర మంటపంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. వేడుకలో మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, శ్రీపతి ఆచార్, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్, ద్వారపాలక అనంతస్వామి పాల్గొన్నారు.

అనుమంత్రాలయంలో..

మండలంలో అనుమంత్రాలయంగా పేరుగాంచిన తుంగభద్రలో శనివారం ఉత్సవాలు నిర్వహించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు గ్రామాన్ని చేరుకుని మృత్తిక బృందావనానికి విశేష పూజలు చేపట్టారు. అనంతరం పండితులు, భక్తులు వసంతోత్సవం జరుపుకుని మంగళహారతులు పట్టారు. వేడుకలో భక్తులకు రాఘవేంద్రుల వైభవాన్ని ప్రవచించారు. కర్ణాటక బాలాగర్ అక్షోభ్య మఠం పీఠాధిపతి అక్షోభ్య రామప్రియ తీర్థులు, మఠం పండితులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు వృక్షాలే ఆధారం

కర్నూలు (లీగల్): మానవ మనుగడకు వృక్షాలే మూలాధారమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో తన సహచర న్యాయమూర్తులతో కలసి మొక్కలు నాటారు. మొక్కలు నాటడం ద్వారా వాతావరణ కాలుష్యం నుంచి ప్రపంచాన్ని కాపాడుకోవచ్చునని చెప్పారు. స్పోర్ట్స్ సొసైటీ వారు పెద్ద ఎత్తున మొక్కలను తెచ్చి న్యాయమూర్తుల చేతుల మీదుగా నాటించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.ఎల్.వి.శేషాద్రి, అదనపు జిల్లా జడ్జిలు జి.భూపాల్‌రెడ్డి, పి.పాండురంగారెడ్డి, సబ్ జడ్జీలు టి.మల్లీశ్వరి, పి.దివాకర్,జూనియర్ సివిల జడ్జీలు టి.జ్యోత్స్నదేవి, ఎం.సరోజనమ్మ, అపర్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్ పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి